# 173 మంది రేసులో..

- ముగిసిన నామినేషన్ల పర్వం
- 31 మంది అభ్యర్థుల ఉపసంహరణ
- 12 నియోజకవర్గాల్లో పోటాపోటీ
- ఐదు చోట్ల త్రిముఖ పోరు
- ఏడు చోట్ల ముఖాముఖి
- కాంగ్రెస్, బీజేపీకి రెబల్స్ బెడద
- జడ్చర్ల బరిలో ట్రాన్స్‌జెండర్
- ఇక ప్రచారంపై అభ్యర్థుల దృష్టి

మహబూబ్‌గర్ నవంబర్ 15 : (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా సాగుతున్నాయి. నామినేషన్ల ఉపసంహరణ చివరి రోజు బుధవారం ఆశించిన స్థాయిలో అభ్యర్థులు ఎవరూ ఉపసంహరించుకోకపోవడంతో ఇక పోటీ అనివార్యమైంది. ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో 173 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ప్రధాన పార్టీలతోపాటు చిన్నాచితక పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు కలిపి భారీ సంఖ్యలో పోటీలో ఉన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో అత్యధికంగా 24 మంది బరిలో ఉండగా, నారాయణపేట నియోజకవర్గంలో ఏడుగురు పోటీ చేస్తున్నారు. జడ్చర్ల నియోజకవర్గంలో ట్రాన్స్‌జెండర్ పోటీలో ఉండడం ఆసక్తి రేకెత్తిస్తోంది. మిగతా చోట్ల నోటాతో కలిపి ఒకే ఈవీఎం అవసరం పడితే కల్వకుర్తిలో, గద్వాల సెగ్మెంట్‌లో మాత్రం రెండు ఈవీఎంలు అవసరమవుతాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ప్రకటించారు. ప్రస్తుతం బరిలో ఉన్న అభ్యర్థుల బలబలాలతో ఐదు చోట్ల త్రిముఖపోరు ఉండగా, ఏడుచోట్ల నువ్వా నేనా అనే రీతిలో ముఖాముఖి పోరు ఉండబోతున్నది. నామినేషన్ల ఘట్టం ముగియడంతో అభ్యర్థులంతా ఇక ప్రచార పర్వంలో మునిగిపోయారు.. ఇంకా 15 రోజులు మాత్రమే సమయం ఉండడంతో గడపగడపకు ప్రచారం చేయడానికి సన్నద్ధమవుతున్నారు. ఇదిలా ఉండగా, గత ఎన్నికలతో పోలిస్తే చిన్నాచితక పార్టీలకు, ఇండిపెండెంట్లను ఈసారి ప్రధాన పార్టీల అభ్యర్థులు పట్టించుకోకపోవడం గమనార్హం. నామినేషన్ వేస్తే ప్రధాన పార్టీ అభ్యర్థులు బుజ్జగిస్తారని అనుకున్నా ఈసారి అలాంటిదేమీ జరగలేదు. కాంగ్రెస్, బీజేపీలకు మాత్రం చాలా నియోజకవర్గాల్లో టికెట్లు రాని అసంతృప్తులు రెబల్స్‌గా పోటీ చేస్తున్నారు. మరికొందరు ఇతర పార్టీల్లోకి జంప్ అయ్యారు. ఒక అభ్యర్థి మాత్రం ఇంకో పార్టీ టికెట్ తెచ్చుకొని సొంత పార్టీకి చుక్కలు చూపించారు. ఇక బీఆర్ఎస్ అభ్యర్థులు అందరి కంటే ముందు ప్రచారం ప్రారంభించి దూసుకుపోతున్నారు.



నామినేషన్ వేసిన అభ్యర్థులతో సమీక్ష నిర్వహిస్తున్న రిటర్నింగ్ అధికారి తిరుపతిరావు

**12 నియోజకవర్గాలు..**

**173 మంది అభ్యర్థులు**

మహబూబ్‌నగర్ జిల్లాలో 32మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు మహబూబ్‌నగర్‌లో 15 మంది, జడ్చర్లలో 15, దేవరకద్ర నియోజకవర్గంలో 12 మంది పోటీలో ఉన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో అత్యధికంగా 77 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. కల్వకుర్తి నియోజకవర్గం నుంచి 24మంది, నాగర్‌కర్నూల్ నుంచి 15, అచ్చంపేట నుంచి 14, కొల్లాపూర్ నుంచి 14మంది బరిలో మిగిలారు. నారాయణపేట జిల్లాలో మక్తల్ నియోజకవర్గం నుంచి 11 మంది, నారాయణపేట నుంచి ఏడుగురు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఈ జిల్లా నుంచి మొత్తం 18 మంది పోటీ చేస్తున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో 33మంది పోటీ చేస్తున్నారు. గద్వాలలో అత్యధికంగా 20 మంది, అలంపూర్ నుంచి 13 మంది పోటీలో మిగిలారు. వనపర్తి నియోజకవర్గంలో 13 మంది పోటీ చేస్తున్నారు. 31 మంది నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. నామినేషన్ల ఘట్టం సజావుగా ముగిసిందని, చిన్న,చిన్న ఫిర్యాదులు ఆయా పార్టీలు చేసినప్పటికీ వాటిని ఎన్నికల కమీషన్‌తో మాట్లాడి సరిదిద్దామని ఎన్నికల అధికారులు తెలిపారు.

**కాంగ్రెస్, బీజేపీలకు రెబల్స్ బెడద..**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కాంగ్రెస్, బీజేపీలకు రెబల్స్ బెడద తప్పడం లేదు. చాలా నియోజకవర్గాల్లో టికెట్లు ఆశించి భంగపడ్డ వారంతా తమదారి తాము చూసుకుంటున్నారు. మరికొన్ని చోట్ల ఇంకా అసంతృప్తి రగులుతూనే ఉంది. గద్వాల నియోజకవర్గంలో పార్టీలో ఉన్న వారిని కాదని ఇటీవల పార్టీ మారిన వారికి టికెట్ ఇవ్వడంతో చాలామంది బీఆర్ఎస్‌లో చేరారు. ఒకరిద్దరు రెబల్స్ పోటీలో ఉన్నారు. మహబూబ్ నగర్ నియోజకవర్గంలో కూడా బీజేపీ నుంచి వచ్చిన వారికి టికెట్ ఇవ్వడంతో పార్టీలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నది. చాలా మంది కారు ఎక్కగా, మరికొందరు బీసీలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని మంఇపడుతున్నారు. దేవరకద్ర నియోజకవర్గంలో టికెట్ ఆశించిన బీసీ నేత బీఆర్ఎస్‌లో చేరారు. మరో నేత ఏకంగా బీజేపీలో చేరి టికెట్ తెచ్చుకుని పోటీ చేస్తున్నారు. మక్తల్‌లో కూడా టికెట్ ఆశించిన నేతలు వేరే కుంపటి పెట్టుకున్నారు. జడ్చర్లలో టికెట్ ఇవ్వకపోవడంతో బీసీ నేత కరెక్కగా, మరికొంత మంది సైలెంట్ అయ్యారు. నాగర్‌కర్నూల్‌లో నాగం జనార్దన్‌రెడ్డి పార్టీ మారి బీఆర్ఎస్‌లో చేరారు. కొల్లాపూర్‌లో కొత్త నేతకు టికెట్ ఇవ్వడంతో అసంతృప్తిలో ఉన్నారు. వనపర్తిలో కూడా ఇదే పరిస్థితి ఉంది. ఇక బీజేపీ దేవరకద్ర టికెట్ ఆశించిన ఓ నేత రెబల్‌గా నామినేషన్ వేశారు. పార్టీని ఓడిస్తానని శపథం చేస్తున్నారు. మక్తల్ టికెట్ ఆశించిన కొండయ్య అసంతృప్తితో ఉన్నారు. నారాయణపేటలో టికెట్ ఆశించిన సత్యయాదవ్ వర్గం బీజేపీ ఓటు వేసే పరిస్థితుల్లో లేదు.

**ఐదు చోట్ల త్రిముఖ పోటీ..**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఐదు చోట్ల త్రిముఖ పోటీ నెలకొన్నది. ఈ నియోజకవర్గాల్లో కూడా బీఆర్ఎస్‌దే పైచేయిగా ఉంది. మహబూబ్ నగర్, కల్వకుర్తి, నారాయణపేట, మక్తల్, కొల్లాపూర్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పోటీ పడుతున్నాయి. బీజేపీ నామమాత్రపు పోటీ ఇస్తుండగా, డిపాజిట్లు కూడా గల్లంతయ్యే అవకాశమున్నది. ఇక మిగతా ఏడు నియోజకవర్గాల్లో నువ్వా నేనా అనే రీతిలో పోటీ కొనసాగుతున్నప్పటికీ వార్ వైన్ సైడ్‌గా బీఆర్ఎస్ తన ప్రచారాలతో జోరు పెంచింది. బీజేపీకి డిపాజిట్లు కూడా రావడం కష్టంగా మారింది. మొత్తంపైనా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఈసారి భారీ సంఖ్యలో అభ్యర్థులు పోటీ చేస్తుండడంతో ఓటర్ల తీర్పుపై ఆధారపడి ఉంది.



క్రికెట్ ఆడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## కాంగ్రెస్‌ను ఓ ఆటాడిస్తా..

- ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- డైట్ కళాశాలలో సరదాగా క్రికెట్ ఆడిన మంత్రి

మహబూబ్‌నగర్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మహబూబ్‌నగర్ అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తనదైన శైలిలో ప్రచారం చేస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల మైదానంలో బుధవారం వాకర్స్‌ను కలిసి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం క్రికెట్ ఆడుతున్న యువకులతో కలిసి సరదాగా బ్యాట్ పట్టుకొని రఫ్ఫాడించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఒక ఆట ఆడిస్తానని.. మీరంతా తనకు మద్దతు ఇవ్వాలని ఓట్లు అడిగారు. శ్రీనివాస్‌గౌడ్ బ్యాటింగ్ చేసి.. ప్రతి బాల్‌ను బౌండరీకి తరలించారు. కాంగ్రెస్‌ను కూడా చిత్తుచిత్తుగా ఓడించి బౌండరీ దాటించాలని ఓటర్లకు మంత్రి పిలుపునిచ్చారు.

## శుభలేఖకు ఎక్కిన అభిమానం..




'ఓట్ ఫర్ కార్' అని ముద్రించిన పెండ్లి పత్రిక

భూత్పూర్, నవంబర్ 15 : ఎన్నికల కోలాహలం పీక్ స్టేజ్‌కి చేరుకున్నది. అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతుంటే.. వారి అనుచరులు మాత్రం తగ్గేదేలే అంటూ విభిన్న రీతితో ముందుకెళ్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సొంత గ్రామమైన అన్నాసాగర్‌లో పార్టీ అభిమాని రాగనమోని శ్రీశైలం ఏకంగా తన కొడుకు పెండ్లి ప్రతికల్లో 'ఓట్ ఫర్ కార్' అంటూ ముద్రించాడు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఫొటోను కూడా ప్రచురించడంతో అందరి కండ్లు ఆ శుభలేఖపై పడ్డాయి. శుభలేఖ అందుకున్న వారంతా కవర్ పేజీపై ప్రచారం చూసి ఇలా కూడా అభిమానం చాటుకోవచ్చా అని ఆశ్చర్యపోతున్నారు. మొతమ్మీద శుభలేఖ ప్రచారం బీఆర్ఎస్ అభ్యర్థికి కలిసి వస్తున్నది.

## వినూత్న ప్రచారం..

- సైకిల్‌పై తిరుగుతూ బీఆర్ఎస్ అభిమాని చాటింపు



మద్దిగట్ల గ్రామంలో సైకిల్‌పై తిరుగుతూ ప్రచారం చేస్తున్న బండలయ్య

**మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం భూత్పూర్ మండలంలోని వెల్కిచర్ల గ్రామానికి చెందిన బుడిగజంగం బండలయ్య వినూత్న ప్రచారానికి తెరలేపాడు. సైకిల్ పంక్చర్ వేస్తూ బండలయ్య జీవనం గడుపుతున్నాడు. కాగా, సీఎం కేసీఆర్ సర్కారు మళ్లీ అధికారంలోకి రావాలని తనవంతుగా కృషి చేస్తున్నాడు. గ్రామగ్రామానా సైకిల్‌పై తిరుగుతూ మైక్‌ద్వారా ప్రచారం చేస్తూ బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరుతున్నాడు. ఈ దృశ్యాన్ని 'నమస్తే తెలంగాణ' మద్దిగట్ల గ్రామంలో బుధవారం క్లిక్‌మనిపించింది.**

**- మహబూబ్‌నగర్ ఫొటోగ్రాఫర్, నమస్తే తెలంగాణ**

## కాంగ్రెస్ నేతల అసత్య ప్రచారం

- పీయూ విద్యార్థుల మాటున ఫేక్ కరపత్రాల పంపిణీ
- కూలీ డబ్బులు చెల్లించి రంగంలోకి దింపిన హస్తం నేతలు
- బీఆర్ఎస్ నేతల అడ్డగింపుతో వెలుగులోకి..
- ఇరువర్గాల మధ్య తోపులాట

మిడ్జిల్, నవంబర్ 15 : బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ నేతలు దాడి చేసిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. మిడ్జిల్ మండల కేంద్రంలో కొంతమంది యువకులు పాలమూరు యూనివర్సిటీ విద్యార్థుల (నిరుద్యోగులం) మాటున సీఎం కేసీఆర్‌కు ఓటు వేయొద్దని కరపత్రాలు పంచుతుడంగా బీఆర్ఎస్ యువనేతలు పట్టుకొని వారిని ప్రశ్నించారు. దీంతో వాళ్లు అసలు యూనివర్సిటీ విద్యార్థులు కాదని తేలింది. కాంగ్రెస్ నాయకులు తప్పుడు కరపత్రాలు ముద్రించి కొంతమంది యువకులకు కూలీ డబ్బులు చెల్లించి బీఆర్ఎస్‌పై అసత్య ప్రచారాలు చేయిస్తున్నట్లు బయటపడింది. సీఎం కేసీఆర్‌ను నేరుగా ఎదుర్కోలేకే ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారు. బీఆర్ఎస్ నాయకులు వారి వద్ద నుంచి కరపత్రాలు స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరగగా.. ఘర్షణ వాతావరణం నెలకొన్నది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఇరువర్గాలతో మాట్లాడి సమస్య పెద్దది కాకుండా చేశారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు. ఓటమి భయంతోనే ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు సుధాబాల్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు జంగిరెడ్డి తెలిపారు. తప్పుడు ప్రచారాలతో ప్రజలను మోసం చేయలేరన్నారు. ఇలాంటి ఎన్ని కుట్రలు చేసినా బీఆర్ఎస్‌దే విజయమని ధీమా వ్యక్తం చేశారు.



ఇరువర్గాలతో మాట్లాడుతున్న పోలీసులు